తెలుగుప్రభ

మన భాష.. మన పత్రిక

teluguprabha.net

-TeluguPrabha

@TeluguPrabhaofficial

TS ఎడిషన్ 4 pm

బుధవారం 2-8-2023

ఆర్ట్ డైరెక్టర్ ఆత్మహత్య

తన స్టూడియోలోనే..

హైదరాబాద్, ఆగస్ట్2 (తెలుగుప్రభ)

బాలీవుడ్ ఇండస్ట్రీలో విషాదం చోటుచేసుకుంది. ప్రముఖ ఆర్ట్ డైరెక్టర్ నితిన్ చంద్రకాంత్ దేశాయ్ ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం ఉదయం అతడు తన స్టూడియోలో ఈ ఘటనకు పాల్పడ్డాడు. నిన్న రాత్రి నితిన్ దేశాయ్ తన స్టూడియోకు వెళ్లాడు. అక్కడే ఉరివేసుకుని మరణించినట్లు ముంబయి పోలీసులు తెలిపారు. గత కొన్ని దశాబ్దాల నుంచి బాలీవుడ్‌లో ఆర్ట్ డైరెక్టర్‌గా నితిన్ చంద్రకాంత్ దేశాయ్(58) గుర్తింపు తెచ్చుకున్నారు. లగాన్, జోధా అక్బర్, దేవదాస్, ప్రేమ్ రతన్ ధన్ పాయో, హమ్ దిల్ దే చుకే సనమ్ వంటి హిట్ మూవీస్ కు నితిన్ దేశాయ్ ఆర్ట్ డైరెక్టర్‌గా పని చేశారు. 20 ఏళ్లుగా బాలీవుడ్‌లో ఫేమస్ ఆర్ట్ డైరక్టర్‌గా ఉన్న నితిన్ దేశాయ్ మృతి వార్త బాలీవుడ్‌ను షాక్ కు గురిచేసింది. ఆయన మృతికి సంతాపం తెలుపుతూ పలువురు నటులు సోషల్ మీడియా ద్వారా పోస్టులు పెడుతున్నారు.

చావులోనూ కలిసే..

ఎన్టీఆర్ జిల్లా, ఆగస్ట్2 (తెలుగుప్రభ)

దాదాపు 30 ఏళ్లపాటు కలిసిమెలిసి దాంపత్య జీవనం సాగించారు. చివరి మజిలోనూ కలిసే ఉన్నారు. ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెంలో విషాదం చోటు చేసుకుంది. భర్త మరణవార్త విని భార్య మృతి చెందింది. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న కోడుమూరి నాగేశ్వరరావు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. భర్త మరణవార్తను బంధువులు రమాదేవికి చెప్పారు. దీంతో షాక్‌కు గురైన రమాదేవి హఠాన్మరణం చెందింది. గంటల వ్యవధిలోనే భార్యాభర్తలు మృతి చెందడంతో గ్రామంలో విషాదం నెలకొంది.

తాగుడుకు బానిసై వేధింపులు

కొడుకును చంపేసిన తండ్రి

భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్ట్2 (తెలుగుప్రభ)

మద్యం తాగి డబ్బు కోసం వేధిస్తున్నాడు. నిత్యం ఆ కొడుకు వేధింపులు భరించలేక తండ్రి నరికి చంపేశాడు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం పట్టణంలోని గౌతంనగర్ కాలనీకి చెందిన జమ్ముల రాజయ్య కూలి పనికి వెళ్తుంటాడు. అతనికి భార్య గిరిజ, ఇద్దరు కొడుకులు, ఓ కుమార్తె ఉన్నారు. కుమార్తెకు వివాహం చేశారు. పెద్ద కొడుక్కి సైతం వివాహం చేయగా.. అతను కుటుంబ సమేతంగా భార్యా, పిల్లలతో వేరొక చోట జీవనం సాగిస్తున్నాడు. చిన్నకొడుకు జక్కుల శంకర్ (38) వ్యాన్ డ్రైవర్ గా పని చేస్తున్నాడు. అతడు మద్యానికి బానిసగా మారడంతో వివాహం చేసుకోడానికి ఎవరూ ముందుకు రాలేదు. డ్రైవర్ గా వెళ్ళినప్పుడు వచ్చిన డబ్బులతో మద్యం తాగుతూ విచ్చలవిడిగా తిరిగేవాడు. అతనికి ఎవరూ ఆధారం లేకపోవడంతో తల్లిదండ్రులు తమ తోపాటే అతన్ని పోషించుకుంటున్నారు. అయితే మద్యానికి బానిసైన శంకర్ డబ్బుల కోసం తల్లిదండ్రులను చిత్రహింసలకు గురి చేయడం మొదలు పెట్టారు. ఇదే క్రమంలో మద్యం తాగిన మైకంలో తల్లిదండ్రులను వేధించాడు. ఆ బాధ భరించలేక తల్లి గిరిజ సమీపంలో ఉన్న బంధువుల ఇంటికి వెళ్లి తలదాచుకుంది. ఆమె తనతోపాటే రాజయ్యను రమ్మని అడగ్గా.. ఇంట్లో ఎవరూ లేకపోతే ఇబ్బంది అవుతుందని అతను వెళ్ళలేదు. అయితే తెల్లవారుజాము నుంచే శంకర్ మళ్లీ గొడవ మొదలు పెట్టాడు. తాగడానికి డబ్బులు కావాలంటూ తండ్రిని ఇబ్బందులకు గురి చేశాడు. ఇంట్లో సామగ్రిని ధ్వంసం చేశాడు. దీంతో విసిగిపోయిన రాజయ్య ఇంట్లో ఉన్న గొడ్డలితో కొడుకుపై దాడి చేశాడు. దీంతో అతను అక్కడికక్కడే రక్తపు మడుగులో మరణించాడు. జరిగిన సంఘటనపై మృతుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి... రాజయ్యను అదుపులోకి తీసుకున్నామని పోలీసులు తెలిపారు.

పైసలు కొట్టేస్తరు.. జర పైలర

చేయాల్సిందేమీ లేదు.. లైకులు కొట్టి, రేటింగ్స్ ఇవ్వడమే అంటూ ఎర

తక్కువ వ్యవధిలో అధిక సంపాదన పేరుతో బురిడీ

సిటీలో పెరుగుతున్న బాధితుల సంఖ్య

టికీలు, ఉద్యోగాలు చేసేవాళ్లే టార్గెట్

సాంకేతికత విప్లవం వల్ల మనుషులకు ఎంత లాభం జరుగుతుందో తెలియదు గానీ 'హైటెక్ మోసాలు' మాత్రం ఊహకు అందనంత రేంజ్‌లో పెరుగుతున్నాయి.

తెలుగు ప్రభ ప్రతినిధి (ఆగస్ట్2)

'మీరు ఏ ఉద్యోగమూ లేక ఖాళీగా ఉన్నారా..? జాబ్ చేస్తున్నా జీతం సరిపోక రెండో సంపాదన కోసం వెతుకుతున్నారా..? అయితే ఈ సదావకాశం మీ కోసమే. మీరు చేయాల్సిందేమీ లేదు. యాప్స్, వెబ్‌సైట్స్‌కు లైకులు కొట్టి మంచి రేటింగ్స్ ఇవ్వడమే.. దీని ద్వారా మీరు రోజుకు రూ. 800 నుంచి రూ. 3 వేల దాకా సంపాదించవచ్చు. పార్ట్ టైమ్ జాబ్ చేస్తూ తక్కువ వ్యవధిలోనే కోటీశ్వరులవండి..' అంటూ మీకు వాట్సాప్‌లోగానీ, టెలిగ్రామ్‌లో గానీ మెసేజ్‌లు వస్తున్నాయా..? వస్తే తస్మాత్ జాగ్రత్త. వాటితో అస్సలు కనెక్ట్ అవకండి. ఇది ఓ రకమైన 'సైబర్ మోసం'.

మారుతున్న కాలానికి అనుగుణంగా మోసం చేసే విధానంలో అప్డేట్ అవుతున్న మోసగాళ్లు.. నెటిజన్ల అవసరాలను ఆసరాగా చేసుకుని వాళ్లను నిండా ముంచుతున్నారు. 'లైకులు కొడితే చాలు', 'రేటింగ్ ఇవ్వడమే మీ పని' అంటూ కొత్త తరహా మోసానికి ఒడిగడుతున్నారు. హైదరాబాద్‌లో గడిచిన నాలుగైదు రోజుల్లోనే ఇటువంటి మోసాల్లో ఇరుక్కున్న 15 మంది.. సుమారు రూ. 1.6 కోట్లు పోగొట్టుకున్నారు.

ఏం చేస్తారు..?

ఈ కాలంలో జేబులో పెన్ ఉన్నా లేకున్నా టచ్ స్క్రీన్ మొబైల్ అయితే 'మ్యాండేటరీ థింగ్' అయిపోయింది. మన ఫోన్లలో ఉండే వాట్సాప్, టెలిగ్రామ్ వంటి సోషల్ మెసేజింగ్ యాప్సే సైబర్ మోసగాళ్ల మోసాలకు వేదికలు అవుతున్నాయి. ఒక అనామక నెంబర్ నుంచి కొంతమందికి బల్క్‌గా మెసేజ్‌లు పంపుతారు. పైన పేర్కొన్న విధంగా నెటిజన్లను ఆకర్షించేలా అధికంగా డబ్బును ఆశచూపి, పెద్దగా కష్టపడాల్సిన పని లేకుండానే ఎక్కువ సంపాదించొచ్చని మభ్యపెడతారు. వాట్సాప్, టెలిగ్రామ్ ద్వారానే ఈ దందా అధికంగా సాగుతోంది. ఎవరైనా ఈ మెసేజ్‌కు రిప్లే ఇస్తే వాళ్ల పలలో చిక్కినట్టే. రిప్లే ఇవ్వగానే అవతలి వ్యక్తి నుంచి మనకు ఫోన్ వస్తుంది. తాము కొన్ని దిగ్గజ సంస్థలు రూపొందించిన యాప్స్ (అమెజాన్, గూగుల్ మ్యాప్స్, ట్రావెలింగ్ ఏజెన్సీస్ వంటివి), వెబ్‌సైట్స్‌తో ఒప్పందం కుదుర్చుకున్నామని, వాళ్లకు రేటింగ్స్ బాగా ఇవ్వడమే మీరు చేయాల్సిన పని అని నమ్మిస్తారు. దాని ద్వారా మీకు రోజుకు రూ. 800 నుంచి రూ. 3 వేల వరకూ సంపాదించే అవకాశం ఉందని ఆశచూపుతారు.

వచ్చినవారికి కాస్త నమ్మకం కలిగే విధంగా రెండు మూడు టాస్కులలో వారి ఖాతాలకు డబ్బులు కూడా పంపిస్తారు. 'ఇక వీళ్లు మన బుట్టలో పడ్డట్టే'అని నిర్ధారించుకున్న తర్వాత వారితో మరిన్ని టాస్కులు చేయాలంటే ముందుగా కొంత మొత్తం డిపాజిట్ చేయాలని.. అలాగైతేనే ఎక్కువగా సంపాదించే అవకాశం ఉంటుందని లింకు పెడతారు. అది నమ్మి పలువురు వేలు, లక్షల్లో డిపాజిట్స్ చేసి నిండా మునుగుతున్నారు.

రూ. 90 లక్షలు కొట్టేశారు

ఈ తరహా మోసంలో బాధితుడిగా ఉన్న సదరు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి మాట్లాడుతూ.. 'టెలిగ్రామ్‌లో వచ్చిన ఓ మెసేజ్ ద్వారా నేను ఇందులో చేరాను. ట్రావెల్ బుకింగ్ యాప్‌లో హోటల్స్, రిసార్ట్స్‌కు మంచి రేటింగ్స్ ఇవ్వడమే నా పని అని వాళ్లు నాతో చెప్పారు. మూడు షీట్స్ ఇచ్చి అందులో ఉన్న హోటల్స్‌కు మంచి రేటింగ్స్ ఇవ్వమన్నారు. ఫస్ట్ టాస్క్ అయ్యాక నాకు కమీషన్ రూపంలో రూ. 811 వచ్చాయి. అవి బ్యాంక్ అకౌంట్‌లో కూడా క్రెడిట్ అయ్యాయి. ఆ తర్వాత మరోసారి రూ. 1,130 వచ్చాయి. నాకు వాళ్ల మీద నమ్మకం కుదిరిందని వాళ్లు నిర్ధారించుకున్నాక పెద్ద టాస్క్‌లు చేయమని చెప్పారు. అందుకు గాను నన్ను రూ. 11,300 డిపాజిట్ చేయమన్నారు. కేరళలోని త్రిసూర్ నుంచి ఓ అమ్మాయి తాను కూడా జాబ్ చేస్తూ ఇలా సంపాదిస్తున్నానని నన్ను నమ్మించింది. దీంతో నేను జూన్ 3 నుంచి జులై 17 దాకా వివిధ బ్యాంకు ఖాతాల నుంచి రూ. 90 లక్షలు ట్రాన్స్‌ఫర్ చేశాను. అయితే డబ్బులు క్రెడిట్ కావాలంటే బ్యాంకు ఖాతాలో బ్యాలెన్స్ మెయింటెన్ చేయాలని ఒత్తిడి చేశారు. అధిక లాభాలు వస్తాయని నమ్మించేందుకు గాను నాకు రూ. 2.23 కోట్లు లాభం వచ్చినట్టు చూపించారు. కానీ నాకు వచ్చింది రూ. 20,100 మాత్రమే. ఆ తర్వాత మళ్లీ వాళ్లు రూ. 47 లక్షలు డిపాజిట్ చేయమని అడగడంతో ఇది మోసం అని గ్రహించి నేను పోలీసులను ఆశ్రయించా..'అని తెలిపాడు.

కోటిన్నర స్వాహా..

భాగ్యనగరంలో గత నాలుగు రోజుల్లోనే సైబర్ క్రైమ్ డిపార్ట్‌మెంట్‌లో సుమారు 20 కేసులు ఇటువంటివే నమోదయ్యాయి. 15 మంది బాధితులు దాదాపు ఒక కోటి 60 లక్షల రూపాయలు మోసపోయినట్టు సైబర్ క్రైమ్ పోలీసుల ముందు లబోదిబోమంటున్నారు. ఈ మోసగాళ్లు టార్గెట్ చేసేది కూడా 'నెట్‌మీద మంచి పట్టు ఉండి ఆర్థికంగా అంతో ఇంతో నిలదొక్కుకున్న టికీలు, ఉద్యోగులనే కావడం గమనార్హం. హైదరాబాద్‌లో పనిచేస్తున్న ఓ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి.. రూ. 90 లక్షలు మోసపోయాడు.

పెరుగుతున్న బాధితులు

నగరంలో ఈ తరహా కేసులు పెరుగుతున్నాయి. మణికొండ నుంచి ఒక హౌస్ వైఫ్ రూ. 18 లక్షలు, అత్తాపూర్ నుంచి ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ రూ. 12 లక్షలు, బండ్లగూడ నుంచి ఓ టీచర్ రూ. 8 లక్షలు, మాధాపూర్ నుంచి ఓ టికీ రూ. 4.5 లక్షలు, షేర్‌లింగంపల్లిలో ఉంటున్న ఓ హెచ్ఆర్ అడ్మిన్ రూ. 2.6 లక్షలు ఈ తరహా మోసాల్లో తీవ్రంగా నష్టపోయినట్టు సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదులు చేశారు. ఇటువంటి 'పార్ట్ టైమ్' సంపాదనకు ఆశపడితే ఫుల్ టైమ్ బాధపడటం తప్పదని, ఆన్‌లైన్‌లో వచ్చే కాల్స్, మెసేజెస్ పట్ల జాగ్రత్తగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.

ఆర్టికల్ 370 రద్దుపై సుప్రీంలో వాదనలు

న్యూఢిల్లీ, ఆగస్ట్2 (తెలుగుప్రభ)

ఆర్టికల్ 370 రద్దు అంశంపై బుధవారం సుప్రీంకోర్టులో అయిదుగురు సభ్యుల ధర్మాసనం విచారణ చేపట్టింది. సీజేఐ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం పిటీషన్లపై వాదనలు వింటోంది. ఆర్టికల్ 370ని రద్దు చేసి రెండు కేంద్ర పాలిత ప్రాంతాలను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. అయితే ఆర్టికల్ 370ని రద్దు చేసిన అంశంపై రాజ్యాంగ చెల్లుబాటును ప్రశ్నిస్తూ కొన్ని పిటీషన్లు దాఖలు అయ్యాయి. సీజేఐ చంద్రచూడ్‌తో పాటు జస్టిస్ ఎస్‌కే కౌల్, జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ సూర్యకాంత్‌లు ఆ ధర్మాసనంలో ఉన్నారు. పిటీషనర్ల తరపున కపిల్ సిబల్ వాదించారు. ఇది చరిత్రాత్మక విచారణ అవుతుందన్నారు. 2019 ఆగస్టు 6వ తేదీన జరిగిన చారిత్రక తప్పును కోర్టు విశ్లేషించనున్నట్లు తెలిపారు. ఈ కేసులో వాదనలు వినేందుకు కోర్టుకు అయిదేళ్ల పట్టిందని, అయిదేళ్ల నుంచి జమ్మూకశ్మీర్‌లో ప్రభుత్వమే లేదన్నారు. ఈ కేసులో తన వాదనలు వినిపించేందుకు సిబల్‌కు 10 గంటల సమయాన్ని కేటాయించారు. భారత్‌లో జమ్మూకశ్మీర్ అంతర్ భాగమని, ఆ రాష్ట్ర చరిత్రను సిబల్ తన వాదనల్లో వినిపించారు. ఈ కేసులో విచారణ చాలా రోజుల పాటు సాగే అవకాశాలు ఉన్నాయి. ఆర్టికల్ 370, ఆర్టికల్ 35ఏను రద్దు చేసిన అంశంపై ప్రస్తుతం కోర్టులో 20 పిటీషన్లు పెండింగ్‌లో ఉన్నాయి. ఆర్టికల్ 370పై రాష్ట్రపతి ఇచ్చిన ఆదేశాలను రాజ్యాంగ వ్యతిరేకమని ప్రకటించాలని పిటీషనర్లు కోర్టులో కోరారు. ఈ కేసులో పిటీషన్ వేసిన వారిలో అడ్వకేట్ ఎంఎల్ శర్మ, కశ్మీర్ లాయర్ షకీర్ షబీర్, ఎంపీ అక్బర్ లోన్, జస్టిస్ మసూదీ, రాధా కుమార్, మాజీ జనరల్ అశోక్ మెహతా, మాజీ ఐఏఎస్ తయబ్‌జీ, అమితాబ్ పాండే, గోపాల్ పిళ్లై ఉన్నారు. ఆర్టికల్ 370 ప్రకారం జమ్మూకశ్మీర్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా వచ్చింది. అయితే ఆ ఆర్టికల్‌ను 2019 రద్దు చేశారు.





అమ్మ తిట్టిందని దుర్గం చెరువులోకి దూకిన బాలిక

మాదాపూర్, ఆగస్ట్2 (తెలుగుప్రభ)

ఫోన్ ఎక్కువగా వాడుతోందని తల్లిదండ్రులు తిట్టడంతో బాలిక మనస్తాపానికి గురైంది. దుర్గం చెరువులోకి దూకి ఆత్మహత్యకు యత్నించింది. పోలీస్ కాపాడడంతో ప్రాణాలతో బయట పడింది. కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్ పరిధిలో నివసించే బాలిక, ప్రస్తుతం ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం చదువుతోంది. బాలిక తన మొబైల్ ఫోన్‌ను ఎక్కువగా ఉపయోగిస్తుండడం, ఇన్‌స్టాగ్రామ్‌లో చాటింగ్ చేయడం గమనించిన తల్లిదండ్రులు మందలించడంతో ఆత్మహత్యయత్నం చేసుకుంది. అంతకు ముందు తమ కూతురు కనిపించడం లేదని తలిదండ్రులు స్థానిక పోలీస్ స్టేషన్ కు వెళ్లి ఫిర్యాదు చేశారు. అయితే ఇక్కడ బాలిక తనతో పాటు తీసుకెళ్లిన మొబైల్ ఫోన్ ఏ తనని రక్షించింది. తమ కూతురు వాడుతున్న మొబైల్ నంబర్ ను పోలీసులకు ఇచ్చారు బాలిక తల్లిదండ్రులు.. వెంటనే నెంబర్ ట్రేసింగ్ లో పెట్టారు పోలీసులు.. బాలిక ఫోన్ దుర్గం చెరువు దగ్గరకి రాగానే ఆఫ్ కావడంతో వెంటనే దుర్గం చెరువు లేక్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు కేబుల్ బ్రిడ్జి పై న ఉన్న సీసీ కెమెరాల ద్వారా బాలిక దుర్గంచెరువు లో దూకినట్టు గుర్తించారు.. వెంటనే లేక్ పోలీసులు స్పందించడం తో బాలిక ప్రాణాలు కాపాడగలిగారు.

మళ్లీ పోటీ చేస్తా..

హైదరాబాద్, ఆగస్ట్2 (తెలుగుప్రభ)



హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ)లోని అవినీతిని అంతం చేసేందుకు దాని అధ్యక్ష పదవికి మళ్లీ పోటీ చేస్తానని టీమిండియా మాజీ కెప్టెన్ మహమ్మద్ అజారుద్దీన్ ప్రకటించారు. సుప్రీం కోర్ట్ నియమించిన రిటైర్డ్ జడ్జీ జస్టిస్ లావు నాగేశ్వరరావు.. అసోసియేషన్ నిబంధనలకు విరుద్ధంగా, విరుద్ధ ప్రయోజనాలు కలిగిన 57 క్రికెట్ క్లబ్‌లపై వేటు వేయడాన్ని ఆయన స్వాగతించారు. ఆయా క్లబ్‌లపై వేటు పడిన ఒక రోజు తర్వాత మీడియాతో మాట్లాడిన ఆయన అసోసియేషన్ అధ్యక్ష పదవి కోసం సెప్టెంబర్‌లో జరిగే ఎన్నికల్లో తన అభ్యర్థిత్వాన్ని ప్రకటించారు. అజారుద్దీన్ మాట్లాడుతూ 'సెప్టెంబర్ 15న జరిగే హెచ్‌సీఏ అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేస్తాను. గత 14 ఏళ్లుగా కొనసాగిన వివాదంపై వేటు పడడం సంతోషంగా ఉంది. ఇన్నాళ్లూ అసోసియేషన్‌ను సరిగ్గా పనిచేయనివ్వలేదు. కానీ ఇప్పుడు అలా జరగదు. నేను ఏ క్లబ్‌కు యజమాని కాదు. మాజీ అంతర్జాతీయ ఆటగాడిగా నాకు అసోసియేషన్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు అనుమతి ఉంది. అసోసియేషన్‌లో ఆట, సౌకర్యాలను మెరుగుపరచడమే ఇప్పుడున్న పెద్ద సవాలు. అర్థికంగా కూడా స్వయంసమృద్ధి సాధించాలి. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్‌కి ఒక మైదానమే ఉంది. ఇతర అసోసియేషన్‌ల మాదిరిగా మరిన్నీ మైదానాలను కలిగి ఉండాలి. నా పదవికాలంలో 2 ఏళ్ల న్యాయపోరాటంలోనే గడిచిపోయింది. ఇకపై మిగిలిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా' అని పేర్కొన్నారు.

9న శిల్పారామంలో జాబ్ మేళా

హైదరాబాద్, ఆగస్ట్2 (తెలుగుప్రభ)

ఈ నెల 9న శిల్పారామంలో భారీ స్థాయిలో ఉద్యోగ మేళా జరగనుంది. పది కంపెనీల్లో 650 ఉద్యోగాలు కల్పిస్తామన్న మంత్రి శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. మహబూబ్ నగర్‌లో నూతనంగా ప్రారంభించిన ఐటీ కారిడార్‌లోని కంపెనీల్లో నియామకాల కోసం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎక్కడికో వెళ్లకుండా ఉన్న చోటే ఉద్యోగం రావడం అదృష్టమని తెలిపారు. మెట్రో రైలు షాద్‌నగర్ వరకు వస్తుందని... భవిష్యత్‌లో మహబూబ్‌నగర్ ఐటీ టవర్ వరకు తెస్తామని తెలిపారు. మహబూబ్‌నగర్ త్వరలోనే కార్పొరేషన్ అవుతుందని వివరించారు.